పొగాకు లో గ్రేడ్.. రేటు టాప్ స్పీడ్

- నాసి రకం పొగాకుకూ మార్కెట్లో గిరాకీ
- కిలో రేటు రూ.215
- రూ. 284.48 కోట్ల విలువైన పొగాకు విక్రయాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



దేవరపల్లి వేలం కేంద్రానికి అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: పొగాకు రైతుల పంట పండింది. మార్కెట్లో ఊహించని ధర లభిస్తోంది. ఈ రేటును చూసి రైతులే అవాక్కవుతున్నారు. లో గ్రేడ్ పొగాకుకు మార్కెట్లో గిరాకీ ఏర్పడింది. ఎగుమతి ఆర్డర్లు భారీగా రావడంతో లో గ్రేడ్ పొగాకును కంపెనీలు పోటీపడి కొనుగోలు చేస్తున్నాయి. పెద్ద, చిన్న అనే తేడా లేకుండా అన్ని కంపెనీలూ పోటీ పడి పొగాకు కొనుగోలు చేస్తున్నాయి. రెండు వారాలుగా వేలం కేంద్రాల్లో లో గ్రేడ్ పొగాకు విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. ఈ రకం పొగాకు కిలో రూ.205 రేటు పలుకుతోంది. మొన్నటి వరకూ కిలో రూ.160 ఉండగా, ప్రస్తుతం రూ.200 నుంచి రూ. 205 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2020–21లో లో గ్రేడ్ పొగాకు ధర కిలో రూ.20 ఉండగా, 2021–22 సీజన్‌లో రూ.60 పలికింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.140 ఉండగా, ప్రస్తుతం రూ.200 నుంచి రూ.205 లభిస్తోందని రైతులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో లో గ్రేడ్ పొగాకుకు డిమాండ్ ఏర్పడడమే ఈ పరిస్థితికి కారణమని అధికారులు అంటున్నారు. రైతులందరూ లో గ్రేడ్ పొగాకును వేలం కేంద్రాలకు తీసుకు వచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకుని ఆనందంగా తిరిగి వెళుతున్నారు. మాడు, సూర పొగాకుకు కూడా మంచి ధర లభిస్తోంది. కిలో రూ.180 నుంచి రూ.190 రేటుకు కొనుగోలు చేస్తున్నారు. ముందుముందు ఈ ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

15 శాతం లో గ్రేడ్ ఉత్పత్తి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో ఈ ఏడాది 15 శాతం లోగ్రేడ్ పొగాకు ఉత్పత్తి జరిగింది. ఎకరాకు 60 నుంచి 80 కిలోల లో గ్రేడ్ పొగాకు ఉంటుందని రైతులు తెలిపారు. వాతావరణం అనుకూలించడంతో నాణ్యమైన బ్రైట్ గ్రేడ్ పొగాకు ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు. అయితే బ్రైట్ గ్రేడ్ కంటే లోగ్రేడ్ (గుల్ల, మాడు, సూర) రకం పొగాకు ఎక్కువగా అమ్ముడు పోతున్నందున రైతులంతా లో గ్రేడ్‌నే ఇప్పుడు వేలం కేంద్రాలకు తీసుకు వస్తున్నారు.

13.41 మిలియన్ల కిలోల విక్రయం

జిల్లాలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాల్లో శనివారం నాటికి రూ.284.48 కోట్ల విలువైన 14.48 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. కిలో గరిష్ట ధర రూ.210, కనిష్ట ధర రూ.170, సగటు ధర రూ.196.47 లభించింది. 1,23,454 బేళ్లను కొనుగోలు చేశారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 26.48 లక్షల కిలోలు, జంగారెడ్డిగూడెం–1 వేలం కేంద్రంలో 31.68 లక్షల కిలోలు, జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో 26.61 లక్షల కిలోలు, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 33.83 లక్షల కిలోలు, గోపాలపురం వేలం కేంద్రంలో 26.27 లక్షల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. ఇంకా రైతుల వద్ద సుమారు 38 మిలియన్ల కిలోలు అమ్మకానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

అమ్ముడుపోయే బేళ్లు తీసుకురావాలి



మార్కెట్లో అమ్ముడుపోతున్న గ్రేడ్ బేళ్లను వేలం కేంద్రాలకు తీసుకురావాలి. ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకును ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకూ మాత్రమే వేలం నిర్వహిస్తున్నాం. రైతులు ఉదయం ఐదు గంటలకు బేళ్లను కాటాలు వేయించుకోవాలి. ఒక్కో బేలు బరువు 150 కిలోలకు మించి ఉండరాదు. రైతుకు అనుకూలమైన మార్కెట్ ఉంది. బేళ్లలో తేమశాతం, బూజు వంటివి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– జీఎల్‌కే ప్రసాద్, వేలం నిర్వహణాధికారి, దేవరపల్లి

లో గ్రేడ్ ధర ఊహించలేదు



మార్కెట్లో లోగ్రేడ్ పొగాకు ఈ ధర ఊహించలేదు. గతేడాది కిలో ధర రూ.60 లభించగా, ప్రస్తుతం రూ.200 నుంచి రూ.205 లభిస్తోంది. ఈ ధర రైతులు ఊహించని పరిణామం. సగటు ధర రూ.196 లభించడం ఆనందంగా ఉంది. వేలం కేంద్రాల్లో లో గ్రేడ్ పొగాకు విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. కంపెనీల మధ్య పోటీ ఏర్పడింది. మూడేళ్లుగా పొగాకు వ్యవసాయం లాభసాటిగా ఉంది.

– కరుటూరి శ్రీనివాసరావు, అధ్యక్షుడు, వేలం కేంద్రం రైతు సంఘం, దేవరపల్లి

క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లపై అపోహలు వద్దు



నిడదవోలులో రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ గంగరాజు

నిడదవోలు రూరల్: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. నిడదవోలు, తిమ్మరాజుపాలెం, సింగవరం గ్రామాల్లోని రైస్‌మిల్లులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్‌లో విక్రయించిన ధాన్యాన్ని సైతం ఆన్‌లైన్ చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతులకు అవసరమైన గోనెసంచులను ఆర్‌బీకేల ద్వారా పూర్తిస్థాయిలో అందిస్తున్నామని చెప్పారు. ఆర్‌ఐ సత్యేంద్ర, వీఆర్వోలు, ఆర్‌బీకే అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామి గుడిలో జీర్ణోద్ధరణ పూజలు



తాడిపర్రు సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉండ్రాజవరం: తాడిపర్రు గ్రామంలోని పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా బుధవారం జీర్ణోద్ధరణ కార్యక్రమం నిర్వహించారు. పండితులు వేద మంత్రాలతో హోమాలు చేశారు. సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో ఆధునాతన రీతిలో ఈ ఆలయాన్ని పునఃనిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అరిగెల వెంకట సుబ్బారావు, సర్పంచ్ కె.నరేంద్ర, గ్రామ పెద్దలు కరుటూరి వెంకటేశ్వరరావు, పెండ్యాల గోవిందరావు, వాకలపూడి సత్యనారాయణ, మట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో డ్రోన్ సర్వే ప్రారంభం



తాడిపర్రులో డ్రోన్ సర్వే కార్యక్రమంలో తహసీల్దార్ కనకరాజు

ఉండ్రాజవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన భూముల రీ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ జి.కనకరాజు అన్నారు. రీ సర్వేలో భాగంగా మండలంలోని తాడిపర్రు గ్రామంలో డ్రోన్ కెమెరా సాయంతో సర్వేను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సర్వే పూర్తయితే భవిష్యత్తులో భూముల వివాదాలు తలెత్తే అవకాశం ఉండదన్నారు. ఒక్క తాడిపర్రు మినహా మండలంలోని అన్ని గ్రామాల్లో రీ సర్వేను పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాడిపర్రు సర్పంచ్ కె.నరేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కరుటూరి వెంకటేశ్వరరావు, వీఆర్వో జె.లక్ష్మీనరసమ్మ, సర్వేయర్ జి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి



చాగల్లు మండలం చంద్రవరం యూపీ స్కూల్లో సైన్సుపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

గోపాలపురం: గ్రంథాలయాల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గోపాలపురం ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం టీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం ఆయన విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. రోజూ గ్రంథాలయంలో పుస్తక పఠనం ద్వారా అనేక విషయాలు నేర్చుకోవచ్చని శాఖా గ్రంథాలయాధికారి వెజ్జు సత్యనారాయణ అన్నారు. సీఆర్పీ కొయ్య నాగరాజు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు: నిజ జీవితంలో సైన్సు ఎంతగానో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం పొన్నపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చంద్రవరం యూపీ స్కూల్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం సైన్స్ పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంచి పుస్తకాలు మంచి స్నేహితులంటివన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



కొవ్వూరు ఆసుపత్రి వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ప్రాంగణంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. మండు వేసవిలో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అనంతరం మంత్రి స్వయంగా కొద్దిసేపు మజ్జిగ పంపిణీ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వరిగేటి సుధాకర్, నగళ్లపాటి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, స్థానిక కౌన్సిలర్ తోట లక్ష్మీ ప్రసన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు సిద్దన వాసు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, డీసీహెచ్‌ఎస్ సనత్‌కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయి కిరణ్, దేవగుప్తాపు లక్ష్మణరావు, పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, గంధ్రోతు శివ రామకృష్ణ, మాసా ఆనంద్, చీర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిన్నటి ఆశ.. నేటి శ్వాస



ఆకులన్నీ రాలిపోవడంతో ఏప్రిల్ 6న మోడులా దర్శనమిస్తున్న రావి చెట్టు



కొత్త ఆకులతో పచ్చగా ఏప్రిల్ నెలాఖరున..

రోజంటే చీకటే కాదు. వెలుగు కూడా. జీవితం అంటే సుఖాలే కాదు కష్టాలు ఉంటాయి. అది మనిషికే కాదు చెట్టుకూ వర్తిస్తుందని నిరూపిస్తోంది ఆ రావిచెట్టు. మొదటి ఫొటో ఆకులు పూర్తిగా రాల్చిన స్థితిలో ఈ ఏడాది ఏప్రిల్ 6న తీసిందైతే, రెండో ఫొటో 20 రోజుల తర్వాత అంటే ఏప్రిల్ నెలాఖరులో కొత్త చిగుర్లు తొడిగాక తీసింది. ఇంతకీ ఈ రావిచెట్టు కొవ్వూరు పట్టణంలోని ఏటిగట్టుపై క్రిస్టియన్ శ్మశాన వాటిక ఎదురుగా ఉంది.

– కొవ్వూరు

పోటీలతో క్రీడాకారుల్లోని ప్రతిభకు గుర్తింపు

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆటల పోటీలు ఉపకరిస్తాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం మంత్రి వనిత ప్రారంభించారు. ఇలాంటి టోర్నమెంట్ ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ఇరవై గ్రామాల నుంచి 30 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని శ్రీనివాస రవీంద్ర తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి సాధించిన జట్టుకు రూ.20 వేలు, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, యువజన విభాగం అధ్యక్షుడు సిద్దన వాసు, పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, నాయకులు చిట్టూరి అన్నవరం, గంధ్రోతు శివరామకృష్ణ, సూర్ల నగేష్, వేంద్ర సూరిబాబు, 15వ వార్డు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

- హోం మంత్రి తానేటి వనిత
- ఔరంగాబాద్‌లో గడప గడపకూ..



ఔరంగాబాద్‌లో ఓ సంక్షేమ పథకాలు వివరిస్తున్న హోం మంత్రి వనిత

కొవ్వూరు: ప్రతిటి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం రాత్రి ఆమె పట్టణంలో 16వ వార్డు ఔరంగాబాద్‌లో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధి గురించి వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు బండి పట్టాభిరామారావు, వల్లభొట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, నాయకులు రాచర్ల రవీంద్ర, మెరిపో వీర్రాజు, పాకా మోహన్ రావు, అయినాల మురళి, తోట రామకృష్ణ, వరిగేటి సుధాకర్, పోసిన శ్రీకృష్ణ దేవరాయలు, కౌన్సిలర్ చీరా అరుణ తదితరులు పాల్గొన్నారు.

మల్లవరంలో ఫ్యామిలీ డాక్టర్

చాగల్లు: గ్రామీణ ప్రాంత పేదలందరికీ ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని చాగల్లు పీహెచ్‌సీ వైద్యులు పి.అరుణ్‌రాయ్ అన్నారు. మండలంలోని మల్లవరంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులకు పరీక్షలు చేశారు.

క్రీడాకారిణికి ఆర్థిక సహాయం అందజేత



క్రీడాకారిణి సహాయార్థం రూ 50 వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



హేమామాధురి

దేవరపల్లి: క్రీడాకారులకు మరింతగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారిణి గేదెల హేమామాధురికి కురుకూరి సొసైటీ రూ.50 వేల ఆర్థిక సాయం చేసింది. దేవరపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే తలారి ఆమె తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు హేమామాధురి 10 రోజుల చెన్నైలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత భారతదేశం తరపున హేమామాధురి పాల్గొంటుందన్నారు. ఆర్థిక సహాయం అందించిన కురుకూరు సొసైటీ చైర్మన్ కూచిపూడి సతీష్‌ను ఎమ్మెల్యే తలారి అభినందించారు. కార్యక్రమంలో దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, సాదే సుబ్బారావు, హైస్కూల్ హెచ్‌ఎం పేరం రవీంద్ర, యలమాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతో ఎమ్మెల్సీ 'కవురు' తులాభారం



పండ్లతో తులాభారం తూగుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కు పండ్లతో తులాభారం వేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఆయనకు చిన వెంకన్న మెమెంటోను, ప్రసాదం అందజేశారు. ఆ తరువాత కవురు పలు రకాల పండ్లతో తులాభారం తూగి శ్రీవారికి మొక్కు తీర్చుకున్నారు. ఆ పండ్లను భక్తులకు పంపిణీ చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు బొండాడ వెంకన్నబాబు, జేవీకే రెడ్డి తదితరులు ఉన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: ఓ ఇంజినీరింగ్ కళాశాల బస్సు ఢీకొని ఒక వృద్ధుడు మృతిచెందిన సంఘటన బుధవారం హుకుంపేట జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాజవోలు అరుంధతీపేటకు చెందిన అనంతారపు వెంకట్రావు (63) స్థానిక పేపరుమిల్లులో పనిచేసి పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం 8.30 గంటల సమయంలో టీవీఎస్ మోపెడ్‌పై రాజవోలులోని ఇంటికి వెళుతుండగా హుకుంపేట జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకట్రావు కుమారుడు అనంతారపు చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై ఆర్.శివాజీ కేసు నమోదు చేశారు.

భూసారం .. దిగుబడికి ఆధారం

- పరీక్షల నిర్వహణకు ప్రణాళిక
- నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



భూసార పరీక్షకు మట్టి సేకరణపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏవో కమల్ రాజ్

నల్లజర్ల: మానవునికి ప్రకృతి సిద్ధంగా లభించిన గొప్ప సంపద భూమి. భూమిలో మొక్కల ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు ఏ మేరకు లభ్యమవుతున్నాయో తెలుసుకొని వాటికి కావాల్సిన మూలకాలను అందించగలిగితే పైరుకు మేలు జరుగుతుంది. అప్పుడే రైతుకు అధిక దిగుబడి వస్తుంది. ఇందు కోసం పంటలు వేయడానికి ముందే భూమిలోని పోషకాల గురించి తెలుసుకునేందుకు భూసార పరీక్షలు తప్పనిసరి. దీనిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ శాఖ నాలుగేళ్ల తర్వాత మళ్లీ మట్టి నమూనాల సేకరణకు తాజాగా శ్రీకారం చుట్టింది. జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ద్వారా పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు నిర్వహించనున్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వాడాల్సి ఉంటుంది. అయితే గత 10,15 సంవత్సరాలుగా భూసార పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే పొలాల్లో ఎక్కువగా భాస్వరం, పొటాష్ ఉన్నట్టు గుర్తించారు. రైతులు పంటలకు వేసిన భాస్వరం కరగకుండా అలాగే ఉన్నట్టు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కొన్ని నేలల్లో నత్రజని కూడా ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. అవగాహన లేక రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులను వేయడం వల్ల సాగు వ్యయం పెరగడమే గాకుండా దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

అధిక వినియోగంతో ఇబ్బందులే..

మొక్కకు సహజమైన మోతాదులో సూక్ష్మ పోషకాలు అందిస్తే కిరణ జన్య సంయోగ క్రియ జరిగి పచ్చగా ఉంటుంది. పొటాష్ ఎక్కువగా వాడడం వల్ల జింక్, మెగ్నీషియం, ఇనుము వంటి సూక్ష్మపోషకాలు నత్రజని, భాస్వరం ఎరువులను తీసుకోకుండా అడ్డుపడతాయి. దీంతో జింక్ లోపం ఏర్పడి ఆకులు తెల్లగా మారి దిగుబడిపై ప్రభావం చూపుతుంది. వరి పైరుకు పొటాష్ ఎక్కువగా వాడడం వల్ల ఏర్పడే జింక్ లోపంతో మొక్క పెరుగుదల లోపం కనిపిస్తుంది. ఒక్కసారి మాత్రమే పొటాష్ వేయాలి.

మట్టి నమూనాల సేకరణ ఇలా..

ఒక్కో రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) పరిధిలో 20 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంటుంది. వ్యవసాయ సహాయకులు రైతుల పొలాలకు వెళ్లి మట్టిని సేకరించాలి. ఆ మట్టి నమూనాలను రాజమహేంద్రవరంలోని ప్రయోగశాలలకు పంపాలి. భూసార పరీక్షల ఫలితాలకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు తెలుగులోనే ముందుగానే అందిస్తారు. అవసరం అయితే ఆర్బీకేకు వెళ్లి ప్రింటు తీసుకోవచ్చు. రైతులకు సంబంధించిన వాట్సాప్ గ్రూపుల ద్వారా భూసార పరీక్ష సమాచారం వచ్చేలా ఏర్పాటు చేశారు.

సేంద్రియ ఎరువుల ప్రాధాన్యం గుర్తించాలి



భూసార పరీక్షల ఫలితాలు వచ్చాక అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మట్టి నమూనాలు ఏవిధంగా తీయాలనే దానిపై సిబ్బందికి శిక్షణ పూర్తి చేశాం. భూసార పరీక్షల ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్ వివరాలే కాకుండా ఆయా భూముల్లోని సూక్ష్మ పోషకాలైన జింకు, బోరాన్, జిప్సం స్థితిగతులు కూడ వెల్లడవుతాయి. భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి పెట్టుబడి లేని ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నాం.పరీక్ష చేసిన పొలానికి సంబంధించిన ఫలితాల కార్డు అందిస్తాం. ప్రభుత్వం రాయితీపై అందించే ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి.

కె.కమల్‌రాజ్, వ్యవసాయాధికారి, నల్లజర్ల మండలం

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

కొవ్వూరు: పదో తరగతిలో మార్కులు సరిగా రాకపోవడంతో తల్లి మందలించిందని కొవ్వూరు గౌతమీ నగర్‌కి చెందిన మల్లి వరప్రసాద్ (16) అనే విద్యార్థి ఆత్మహత్యా యత్నం చేశాడు.అతడు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. తల్లి మందలించిందని మనస్తాపం చెందిన అతడు ఈనెల 9న కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని తొలుత రాజమహేంద్రవరం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి వరసకు సోదరుడైన మల్లి దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సునోద్ తెలిపారు.